నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | మార్చి 26, 2025 | www.navatelangana.com

నాడు సర్పంచ్.. నేడు ఉపాధి కూలీ


వృత్తంలో ఉన్న వ్యక్తే మాజీ సర్పంచ్

నవతెలంగాణ-గాంధారి

ఒక్కసారి వార్డ్ మెంబర్ గెలిస్తేనే కార్లలో తిరుగుతూ కద్దర్ చొక్కా వేసుకొని బిల్డప్పులు ఇస్తున్న ఈ తరుణంలో.. ఓ సర్పంచ్ మాత్రం ఐదేండ్ల పాటు పని చేసి ప్రస్తుతం ఉపాధి కూలీగా మారాడు. గాంధారి మండలంలోని మాతు సంగెం గ్రామ పంచాయతీకి గత ఐదు సంవత్సరాలుగా కమ్మరి భాస్కర్ సర్పంచ్ గా పనిచేశారు. ఐదు సంవత్సరాలు గ్రామంలో అందరిని కలుపుకొని గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. సర్పంచ్ పదవి కాలం అయిపోవడంతో ఇటు వ్యవసాయంతో పాటు ఉపాధి హామీ కూలిగా మారాడు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. లబ్ధిదారులు త్వర త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని పనులు జరుగుతున్న క్రమంలో ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సౌజన్య, అఖిల, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాలు

- సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించాలి
- మహిళలకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హితవు
- అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తాం : కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

యాసంగి సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు విరివిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించామని మాజీ మంత్రి, సీనియర్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. జిల్లాలో 670 కొనుగోలు కేంద్రాలకు గాను, వాటిలో మహిళా సంఘాలకు కనీసం 200 పైచిలుకు కేంద్రాలను కేటాయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం మహిళా సంఘాల ప్రతినిధులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొని ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై మహిళా సంఘాలకు కీలక సూచనలు చేశారు.

మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థిని, విద్యార్థులు యూనిఫామ్ లు కుట్టే బాధ్యతలను, ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బ్యాంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు వంటి సుమారు 14 రకాల పనులను ప్రభుత్వం మహిళలకు కేటాయిస్తూ, వారి అభ్యున్నతికి ఇతోధికంగా కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా జిల్లాలోని మహిళా సంఘాలు మరింత ఆర్థిక ప్రగతిని సాధించాలనే ఆకాంక్షతో సాధ్యమైనంత మేరకు ఎక్కువ సంఖ్యలో కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించామని తెలిపారు. గత సీజన్‌లో ఐకెపి మహిళా సంఘాల ద్వారా జిల్లాలో కేవలం 50 కేంద్రాలు మాత్రమే నిర్వహించబడ్డాయని, ప్రస్తుత సీజన్ లో ఇప్పటికే 110 కేంద్రాల నిర్వహణ కోసం ఎస్.హెచ్.జి గ్రూపులను గుర్తించినట్టు తెలిపారు. వీటి సంఖ్యను కనీసం 200 పైబడి పెంచాలని, తద్వారా మహిళా సంఘాలు కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా కమీషన్ రూపేణా సుమారు 5 కోట్ల రూపాయల వరకు లాభాలు ఆర్జించగలుగుతారని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆశాభావం వెలిబుచ్చారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్

కొత్తగా కొనుగోలు కేంద్రాలు కేటాయించబడిన మహిళా సంఘాల ప్రతినిధులకు ధాన్యం సేకరణ, కేంద్రాల నిర్వహణపై సహకార సంఘాల బాధ్యులు, సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించే మహిళా సంఘాలకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా మద్దతు అందిస్తామని భరోసా కల్పించారు. ముఖ్యంగా ధాన్యం రవాణాకు సంబంధించిన లారీల విషయంలో, అలాగే హమాలీల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 110 ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇంకనూ జిల్లాలో ఆసక్తి కలిగిన మహిళా సంఘాలు కేంద్రాల నిర్వహణకు ముందుకు వస్తే, వారి అర్హతను పరిశీలించి నిర్వహణ బాధ్యతలు కేటాయిస్తామని కలెక్టర్ సూచించారు. కేంద్రాల నిర్వహణ తీరు గురించి స్పష్టమైన అవగాహనను ఏర్పర్చుకోవాలని, లావాదేవీల నిర్వహణను సక్రమంగా నిర్వర్తించాలని హితవు పలికారు. ధాన్యం సాధారణ రకానికి క్వింటాలుకు రూ. 2300, ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2320 రూపాయలను ప్రభుత్వం అందజేస్తుందని, దీనితో పాటు సన్న ధాన్యానికి బోనస్ రూపంలో అదనంగా క్వింటాలుకు 500 రూపాయల చొప్పున ప్రభుత్వం రైతులకు వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, మెప్మా పీ.డీ రాజేందర్, డీసీఓ శ్రీనివాస్, మార్కెటింగ్ ఏ.డీ గంగవ్వ, స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు

కామారెడ్డిలో 446 కొనుగోలు కేంద్రాలు : కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 446 కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు కొనుగోలు కేంద్రాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ రానున్న యాసంగి సీజన్‌లో 2.26 లక్షల ఎకరాల వరి పంట సాగు చేసినందున సుమారుగా 6.20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు 5.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నదని అంచనా వేశారు. అలాగే ప్రభుత్వ అధికారులు పూర్తి సమన్వయంతో పని చేస్తూ కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలనీ అయన కోరారు. ప్రతి కేంద్రం లో రైతులకు తాగునీరు, ఓఆర్ ఎస్ ప్యాకేట్స్, ఎండా తీవ్రతకు తగిన టెంట్లు ఏర్పాట్లు చేసుకోవాలని సరిపడా తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్స్ అందజేయాలని కోరారు. జిల్లాకు కేటాయించిన ప్యాడి క్లీనర్స్ ను సద్వినియోగం చేసుకోవాలని రైతుల నుండి సేకరించిన ధాన్యానికి క్వింటాలుకు కనీస మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి గాను రూ.2,320, కామన్ రకానికి రూ. 2,300 సన్న రకం వడ్లకు చెల్లించాల్సిన 500 బోనస్ కొరకు రైతులు తమ ధాన్యం వివరములను ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని 24 గంటలలో వారి బ్యాంక్ ఖాతాలలో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించాడానికి జిల్లా కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 08468 - 220051 ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, డి సిఎస్. ఓ మల్లిఖార్జున బాబు, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బీజేపీ

- అప్రజాస్వామిక నిర్ణయాలతో వ్యవస్థలన్నీ నిర్వీర్యం
- బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలి
- జై బాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశంలో కాంగ్రెస్

నవతెలంగాణ-కంఠేశ్వర్


ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తు అపహాస్యం చేస్తుందని సిరిసిల్ల గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. అప్రజాస్వామిక నిర్ణయాలతో వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేస్తుందని.. బిజెపి అవలంభిస్తు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకే జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, నూడ చైర్మన్ కేశ వేణు అధ్యక్షతన అర్బన్ నియోజకవర్గ జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా అర్బన్ నియోజకవర్గ కార్యక్రమ ఇన్చార్జీ, సిరిసిల్ల గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కార్యక్రమ రాష్ట్ర ప్రతినిధి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. జై బాబు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమం అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కార్యక్రమంలో పాల్గొని పార్టీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతారెడ్డీ రాజారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావేద్ అక్రమ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు గోపి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేవతి, అబ్దుల్ ఏజజ్, బొబ్బిలి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త మొక్కలు నాటాలి

- జిల్లా గ్రామీణ అభివృద్ధిఅధికారి సాయ గౌడ్

నవతెలంగాణ-వేల్పూర్ (ఆర్మూర్)



మాట్లాడుతున్న సాయగౌడ్

మొక్కల పెంపకం బాగుందని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయ గౌడ్ ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా మంగళవారం వేల్పూర్ ఉపాధి హామీ ఆఫీస్ ప్రాంగణంలో 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు కోట్ల 50 లక్షల రూపాయలు కు సంబంధించి నిర్వహించారు. కూలీలకు అకౌంట్ నంబర్ తప్పిదాల వల్ల నిలిచిపోయిన డబ్బులను వారి ఖాతాల్లో వేసేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ, ఎంపీడీవో బాలకిషన్, ఏపీఓ అశోక్ , ఎస్ఆర్పి సుశీల , బిఆర్పిలు వి యెస్ లు వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతాయిపేట్‌కు బస్సు ట్రిప్పులు పెంచాలి

- ఆర్టీసీ డిఎంకు వినతి


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

నవతెలంగాణ-తాడ్వాయి

తమ గ్రామానికి బస్సు ట్రిప్పులు పెంచాలని కోరుతూ మండలంలోని సంతాయి పేట్ గ్రామస్తులు మంగళవారం నిరసన చేపట్టారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి నుండి తాడ్వాయి, చిట్యాల, మీదుగా, సంతాయి పేట్ వరకు గతంలో ఉదయం ఐదు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు తొమ్మిది ట్రిప్పులు బస్సులు వచ్చేవని ప్రస్తుతం నాలుగు ట్రిప్పులు రావడంతో కామారెడ్డిలో కళాశాలకు, ఇతర పనులకు వెళ్లేందుకు తాముతీవ్ర ఇబ్బందుల కు గురవుతున్నామని, తిరుగు ప్రయాణంగా స్వగ్రామానికి రావడానికి అధిక చార్జీలు వెచ్చించి ప్రత్యేక వాహనాలతో రావాల్సి వస్తుందని, విద్యార్థులు, ప్రయాణికులు తెలిపారు. గతంలో కామారెడ్డిడిపో మేనేజర్ కు వినతి పత్రం అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ప్రస్తుతమైన యధావిధిగా బస్సులు నడపాలని కోరుతూ మంగళవారం మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ కింద చేపడుతున్న కార్యక్రమా లను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఈ నెల 31తో ముగిస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు దారులు సకాలంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోగానే ప్రొసీడింగ్స్ జారీచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సిహెచ్.రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ వెనుగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.55 వేలకు కన్నబిడ్డ విక్రయం

- పెట్రో కార్, బ్లూ కోర్ట్ పోలీస్ సిబ్బంది పనితీరుతో వెలుగులోకి
- అభినందించిన ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి

విధి నిర్వహణలో ఉండి తక్షణమే స్పందించి మగ శిశువును సంరక్షించిన పెట్రో కార్, బ్లూ కోర్ట్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మంగళవారం అభినందించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం కామారెడ్డి పట్టణంలో గల వీక్లీ మార్కెట్ సమీపంలో మధ్యాహ్నం సమయంలో కొందరు వ్యక్తులు ఏదో విషయం గొడవపడుతున్నట్టు సమాచారం రాగా పట్టణ పోలీస్ స్టేషన్లో పెట్రో కార్‌లో డ్యూటి చేస్తున్న ఏఎస్ఐ రంగారావు, పిసి వెంకటేష్ సిబ్బంది వెంటనే అట్టి ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు. వారిలో ఒకరికి పుట్టిన మగ శిశువు వేరే వారికి అమ్మగా వచ్చిన డబ్బుల విషయంలో గొడవ జరుగుతుందని తెలుసుకొని, వెంటనే ఉన్నతాధికారులకు, డీసీపీవోకు సమాచారం అందించారు. కాగా వారు వచ్చి విచారణ చేయగా.. క్యాసంపల్లి గ్రామానికి చెందిన పల్లపు రాజమణి, నర్సింలు అనే వారికి పుట్టిన మగ బిడ్డను ఈ నెల 19వ తేదీనా మధ్యవర్తుల అయిన పిట్ల వెంకటి, రాములు సమక్షంలో 55 వేల రూపాయలకు నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని ఒక గ్రామానికి చెందిన భార్యాభర్తలకు అమ్మినారని తెలుసుకున్నారు. ఈ విషయంలో కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో విచారణ చేసి పుట్టిన బాబును అక్రమంగా కొనుగోలు చేసిన వారి వద్ద నుండి స్వాధీనం చేసుకొని, డిసిపిఓ కు తదుపరి చర్యల నిమిత్తమై అప్పగించారు. అంతేగాక చిన్న బాబును అమ్మిన వారిపై, మధ్యవర్తులపై, పుట్టిన బాబు ను కొన్న వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించి, పుట్టిన బాబును సంరక్షించిన ఏఎస్ఐ రంగారావు, కానిస్టేబుల్ వెంకటేష్, హెూం గార్డ్ బాలరాజ్, ఏ.ఆర్.పి.సి. లక్ష్మణ్‌ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పట్టణంలో, జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెట్రోలింగ్ పార్టీలు, బ్లూ కోర్ట్ పార్టీలు 24/7 డ్యూటిలు నిర్వహిసున్నారని తెలిపారు. ఎవరైనా చిన్న పిల్లల అమ్మడం కాని కొనడం చేస్తే సమాచారాన్ని తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాలలో జాబ్‌మేళా

- 30 మంది అభ్యర్థుల ఎంపిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


ఎంపికైన పలువురు విద్యార్థులు

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నిజామాబాద్ లో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ , కెరీర్ గైడెన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. హెచ్‌డిఎఫ్‌సి, యాక్సిస్ బ్యాంక్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో నియామకాల కోసం నిర్వహించి మేళా విజయవంతమైందని ప్రిన్సిపల్ డాక్టర్ పి రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

నైపుణ్య శిక్షణ , ఉపాధి కల్పనలో గిరిరాజ్ కళాశాల ఎల్లప్పుడు ముందంజలో ఉంటుందని టి ఎస్ కే సి , కెరీర్ గైడెన్స్ సెల్ సమన్వయకర్త డాక్టర్ పి రామకృష్ణ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఉద్యోగమేళాలో 200 మంది పైగా పాల్గొనగా 30 మంది అభ్యర్థులు తదుపరి రౌండ్స్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీఎస్ కేసి మెంటార్ ఎస్ శ్రీకాంత్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశాలపై దాడి అమానుషం

- ఖండించిన సీఐటీయూ
- కనీస వేతనాలు అమలు చేయాలని కోరితే దాడులు చేస్తారా అని మండిపాటు

నవతెలంగాణ-విలేకరులబృందం

హైదరాబాదులో ఆశా కార్యకర్తలపై జరిగిన దాడిని, అక్రమ అరెస్టులను నిరసిస్తూ తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు. కనీస వేతనం నిర్ణయించాలని కోరుతూ శాంతియుతంగా నిరసన చేపడితే మహిళలను కూడా చూడకుండా దాడి చేయడం అమానుషమని మండిపడ్డారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో పీహెచ్‌సీల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు మంగళవారం నిరసనలు చేపట్టారు.

నల్ల బ్యాడ్జీలతో ఆశావర్కర్ల నిరసన, ర్యాలీ

కంఠేశ్వర్ : ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో పీహెచ్‌సీల వారిగా మంగళవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. ఈనెల 24న జరిగిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పోలీసు వర్గాలు అడ్డుకొని ఆశా వర్కర్లను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుకన్య, రేణుక, శోభ, నర్స, రేణుక, సాహిర, రేవతి, పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లు అడుగుతున్నది గొంతెమ్మ కోరికలు కాదని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రూ.18వేలు వేతనం ఇవ్వాలని అడుగుతుంటే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించటం సరైంది కాదని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆశా వర్కర్ల ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా రూపకల్పన చేసి ఈ రాష్ట్రాన్ని స్తంభింప చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లావణ్య, లక్ష్మి సరిత, జరీనా, సుల్తానా, వహీదా, విజయ, గీత, పాల్గొన్నారు.


నిజామాబాద్‌లో..


వర్నిలో దిష్టిబొమ్మ దహనం

వర్ని: మోస్రా మండల కేంద్రంలో బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లా డుతూ.. ఆశా కార్యకర్తలకు రూ, 18 వేలు శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. హైదరాబాదులోని కోఠిలో గల వైద్య ఆరోగ్య కమిషనర్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ఆందోళన చేపడితే ప్రభుత్వం పోలీసులను ఉసిగొలిపి ఆశా కార్యకర్తలపై దాడి చేసి, ఈడ్చికెళ్తూ అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఖండిస్తున్నా మన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళా ఉద్యోగుల పట్ల చిన్న చూపు తగదని మండిపడ్డారు. ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే శాసనసభలో చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ, యూనియన్ నాయకులు రాణి, భాగ్యలక్ష్మి, గంగా, సరోజ, లక్ష్మి రూప, ఉమా, శ్యామల, సాత్విక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి పీహెచ్‌సీ ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న ఆశాలు.. డిచ్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక్కరోజు ఆశ వర్కర్ల నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల ఆశావర్కర్ల అధ్యక్షురాలు రమ తెలిపారు. చలో హైదరాబాద్‌కు మండలం నుంచి 60 మంది ఆశ వర్కర్లు వెళ్తుండగా తూప్రాన్ వద్ద పోలీసులు తమను అదుపులోకి తీసుకొని అసెంబ్లీ ముట్టడికి వెళ్ళనీయకుండా చేశారని, అదే విధంగా హైదరాబాద్‌లో ఆశాలపై పోలీసుల దాడికి నిరసనగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్షురాలు రమ తెలియజేశారు.

మా 'ఆశలు' నెరవేర్చన్నా

డిచ్‌పల్లి : రేవంతన్న మా 'ఆశ'లు నెరవేర్చన్నా అని మండల అధ్యక్షురాలు బోడికే స్వప్న కోరారు. ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను మహిళలని చూడకుండ ప్రభుత్వం పోలీసులుతో ఎక్కడ పడితే అక్కడ సోమవారం రాత్రి అరెస్టులకు పూనుకున్నారని దుయ్యబట్టారు. తాము చాలీచాలని వేతనాలతో దశాబ్ద కాలం పాటు పనులు చేస్తున్నామని, పనికి తగ్గ వేతనం లేక తమ కుటుంబాలు ఇబ్బందుల్లో ఉన్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సునీత, నిర్మల, పి.రేణుక, గంగ లక్ష్మి, బండ ప్రమీల, సావిత్రి, లక్ష్మి, పాశం జ్యోతి, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు సైన్సు మెటీరియల్ అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలకు చిట్టాపూర్ గ్రామ వాస్తవ్యులు పారిశ్రామిక వేత్త ఏనుగు దయానంద రెడ్డి సహాయంతో 2 లక్ష రూపాయల విలువైన సైన్స్ మెటీరియల్ వితరణగా చేసినట్టు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య మంగళవారం తెలిపారు. పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు మల్లేష్ గౌడ్, పాఠశాల సిబ్బంది సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌పై సన్నాహక సమావేశం

నవతెలంగాణ-నందిపేట్

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశం మంగళవారం నందిపేట్ మండలంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి అధ్యక్షత వహించగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ మార చంద్రమోహన్ నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, నిజామాబాద్ మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలాపూర్ సుదర్శన్. పిఎసిఎస్ చైర్మన్ గంగారెడ్డి,పిప్రి సాయి రెడ్డి లింగన్న రాజేందర్, వెల్మల్ గోపి, మోహన్ రావు మాజి సర్పంచులు, మాజి ఎంపిటిసి లు, కాంగ్రేస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అడ్వాన్స్‌గా స్కూల్ ఫీజుల వసూళ్లు

- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో ముందస్తు అడ్మిషన్లు, అడ్వాన్స్ స్కూల్ ఫీజులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజు కడితేనే విద్యార్థికి పరీక్షలు రాసే అవకాశం లేదంటే నిర్లక్ష్యం వహిస్తారనే ఆందోళనతో తల్లిదండ్రులు ఫీజులు కడుతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు మాకు ఫిర్యాదు రాలేదే...? ఫిర్యాదు వస్తే కానీ మేము ఏ ప్రైవేటు పాఠశాలను ఎప్పుడు కూడా తనిఖీ చేయమని, ప్రైవేట్ పాఠశాలలకు కానీ, కార్పొరేట్ విద్యా సంస్థలకు కానీ తనిఖీలు చేసే అధికారం మాది కాదు అనే విధంగా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహానికి గురవుతున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనే జిల్లా విద్యాశాఖ అధికారులు. ఉన్నప్పటికీ ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్పొరేట్ విద్యా సంస్థలను తనిఖీ చేసింది లేదని, ఆ విద్యా సంస్థకు నేనే రాజు నేనే మంత్రి అనే తరహాలో విద్యా సంస్థల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని, దీనికి కళ్లెం వేసే అధికారులే లేరా.... అని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్షిక సంవత్సరం పూర్తి అయ్యే సమయంలో వార్షిక పరీక్షల సమయం నాటికి ఈ సంవత్సరం పాఠశాల ఫీజు చెల్లిస్తారు. అటువంటిది వచ్చే సంవత్సరం ట్యూషన్ ఫీజును ముందుగానే చెల్లించడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోనిప్రైవేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ విద్యా సంస్థలు వచ్చే సంవత్సరానికి సంబంధించిన పుస్తకాలను ఈ సంవత్సరమే కొనుగోలు చేయాలనే పంథాలో ముందుకు పోతున్నాయి. వచ్చే సంవత్సరం విద్యార్థి వేరే పాఠశాలకు వెళ్తారా... అక్కడ అడ్మిషన్ పొందుతారా... అనే సందేహం లేకుండా ఉండేందుకు ముందస్తుగానే ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యార్థి మా వద్దనే ఉంటాడని, సీటు ఖాళీఉండదని ముందస్తుగానే ఈ ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. కార్పొరేట్ విద్యాసంస్థలు అయితే ఏకంగా వచ్చే సంవత్సరం పుస్తకాల ఫీజు సుమారు 10 నుంచి 15 వేల రూపాయలు, ఫీజులో (20శాతం) ముందస్తుగానే చెల్లించుకుంటున్నారు. ఫీజు అడ్వాన్స్‌గా చెల్లించిన వారికే 9వ తరగతిలో వార్షికోత్సవ పరీక్షలు రాయడానికి అవకాశం ఉంటుంది.. లేదంటే 10వ తరగతి ఎలాగో మా విద్యాసంస్థలో చదవడం లేదు అనే నిర్లక్ష్యం కూడా విద్యార్థిపై ఏర్పడుతుందని తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో విద్య అభ్యసించాలి అనే ఉద్దేశంతో అప్పో సొప్పో చేసి వచ్చే సంవత్సరం ఫీజును కూడా ఈ సంవత్సరమే చెల్లిస్తున్నారు. ఇది ఎక్కడి న్యాయం... విద్య శాఖ అధికారులే తెలియాలని తల్లిదండ్రులు అంటున్నారు. కానీ విద్యాశాఖ అధికారులు ఏమాత్రం ఏ ప్రైవేటు పాఠశాలని కార్పొరేట్ విద్యాసంస్థలను ఎక్కడ తనిఖీలు చేసిన దాఖలాలు లేవని, ఎందుకంటే ముడుపులు అందుతున్నాయే ఆరోపణలు లేకపోలేదు.

బాలల సంరక్షణ సంక్షేమ శాఖకు ధన్యవాదాలు

- ఐద్వా మహిళా సంఘం



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని నాగారం 300 క్వార్టర్స్‌లోని ఇద్దరు చిన్నారులను అక్కున చేర్చుకున్న బాలల సంరక్షణ సంక్షేమ శాఖ వారికి బస్తీ వాసుల ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ తరఫున ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. మంగళవారం నగరంలోని ఐద్వా జిల్లాకమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. రోజురోజుకీ చిన్న పిల్లలపై హింసలు పెరుగుతున్నాయన్నారు. చిన్న పిల్లల్ని కొట్టి రోడ్డున పడేస్తున్న ఘటనలు ఎన్నో తమ దృష్టికి వస్తాయన్నాయి. తల్లితండ్రులని కొడుకులు, కోడలు కొట్టి రోడ్లపై వదిలేస్తున్న పరిస్థితి చూస్తున్నామన్నారు. వాటిని అరికట్టే విధంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఐద్వా దృష్టికి వచ్చిన వారిని తమ వంతుగా సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వనజ, మాధవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన లలిత (ఫైల్)

నవతెలంగాణ-మోర్తాడ్

ఉపాధి నిమిత్తం మోర్తాడ్ గ్రామానికి వచ్చిన మూడ లలిత (40) కనిపించడం లేదని తన భర్త గిర్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రం మంగళవారం తెలిపారు. అంబాపూర్ గ్రామం రుద్రూర్ మండలానికి చెందిన వీరు ఉపాధి నిమిత్తం గత కొన్ని సంవత్సరాల క్రితం మోర్తాడ్ గ్రామానికి వలస వచ్చారు. కూలి పని నిమిత్తం ఈనెల 21న ఇంటి నుండి బయటకు వెళ్లిన లలిత నేటి వరకు ఇంటికి రాకపోవడంతో తన భర్త ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమే

- రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర నాయకులు, తోట రాజశేఖర్



ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయున్ని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యగ పవిరమణ తప్పనిసరని రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర నాయకులు తోట రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్ ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉద్యోగ విరమణతోపాటు ఆయన షష్టిపూర్తికూడా కావడంతో రమేష్ దంపతులను గ్రామ పెద్దలు, పాఠశాల బాల బాలికలు, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. వీడ్కోలు సమావేశానికి గ్రామ పెద్దలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తోట రాజశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ వాహెబ్ భారీ మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ విద్య పట్ల ప్రత్యేక కృషి చేశారు. నాయకులు గుర్తు చేశారు. క్రీడల్లో జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో మంచి పేరు తెచ్చేందుకు కృషి చేసిన ఘనత ఆయనకి దక్కిందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ క్యాంప్ స్థానిక గ్రామస్తులు మెడికల్ సొసైటీ రాష్ట్ర నాయకులు కోట రాజశేఖర్, శ్రీనివాస్ గౌడ్,, ఎడపల్లి మండల పి ఆర్ టియు(టిఎస్) అధ్యక్షులు సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు అబ్దుల్ వాహీబ్ భారీ, భారీ, శ్రీనివాస్ గౌడ్కృష్ణ గౌడ్, గ్రామ పెద్దలు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని నారాయణపేట గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో ఎంపీడీవో సతీష్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లను ఏ విధంగా కట్టుకోవాలి ఎటువంటి నాణ్యత ఉండాలి.. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాల పైన లబ్ధిదారులతో చర్చించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి యూసఫ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి గుండెపోటుతో మృతి

- సంతాపం తెలిపిన కార్యదర్శులు, ఎంపీడీవో, సిబ్బంది
- జీవో 317 రద్దు కాకపోవడమే మా పాలిట శాపం : ఉద్యోగులు



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎం వెంకటేశ్వర్లు (45) (పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ వన్) గుండె పోటు రావడంతో మంగళవారం రాత్రి మృతి చెందినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంత్ రావు తెలిపారు. వెంకటేశ్వర్లు శనివారం కడుపునొప్పి తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందగా కడుపునొప్పి తగ్గిందని, అర్ధరాత్రి అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో మృతి చెందినట్లు పలువురు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. జీవో 317లో భాగంగా మూడున్నర ఏళ్ల క్రితం ఇందల్ వాయి మండలంలోని గన్నారం గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉంటూ గ్రామ అభివృద్ధికి పాటుపడ్డారని గ్రామస్తులు వివరించారు. మంగళవారం స్వగ్రామం జోగులాంబ గద్వాల్ జిల్లా, మానవపాడు మండలంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఎంపిఓ రాజ్ కాంత్ రావు,ఇతర పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆకస్మిక మృతి బాధించిందని ఎంపిడిఓ అనంతరావు, కార్యదర్శులు అన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు తిరునగరి శ్రీధర్, రజని, అనూష, ఏపిఓ పోశెట్టి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, కార్యాలయ సిబ్బంది, తిరుపతి, సాయిలు, తదితరులున్నారు.

జీవో 317తోనే ఇబ్బందులు

మృత్యువాత పడుతున్న కనికరించరా...

గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలో జీవో 317 తోనే తమకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవో వచ్చినప్పటినుండి తమ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని ఇతర మండలాల నుండి నిజామాబాద్ జిల్లాలో దాదాపు 20 మంది వరకు వీధులు నిర్వహిస్తున్నామని అన్నారు. గత ఎన్నికల సమయంలో 317 జీవోను రద్దు చేస్తామని అప్పటి పిసిసి అధ్యక్షులు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిన నేటి వరకు ఆ జీవో రద్దు విషయమై నిర్ణయం తీసుకోలేదన్నారు. తాము స్వగ్రామాలకు వెళ్లాలంటే రెండు రోజుల సెలవు ఉంటేనే ఒకరోజు ఉండగలుగుతున్నామని, ఆ రెండు రోజులు సెలవు వచ్చినప్పుడు ఏదో ఒక కార్యక్రమం ఉంటే స్వగ్రామానికి వెళ్లడం గగనమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు పని భారం, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కొందరి ప్రాణాలు కూడా పోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ కార్యదర్శులకు సైతం తమ తమ జిల్లాలకు కేటాయించే విధంగా ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేయాలని విన్నవించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం లోని టీచర్స్ కాలనీలో నిజాంసాగర్ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ మంగళవారం తెలిపారు. ఇతని వయస్సు సుమారు 35 నుండి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని అన్నారు. మృతుని ఒంటిపై నలుపు రంగు ఆఫ్ హాండ్స్ టీషర్ట్ ,సిమెంటు రంగు నైట్ ప్యాంటు కలవనీ,. మృతుడి ఆచూకీ తెలిసినవారు స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని నయాబాది ప్రాంతంలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణంలో మంగళవారం ఎడపల్లి కౌడిన్య గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మంగళవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు నటరాజ్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఎడపల్లి గౌడ సంఘం ప్రతినిధులు నటరాజ్ గౌడ్, కళ్యాణ్‌గౌడ్, ఎల్లా గౌడ్, రావుట్ల స్వామి గౌడ్, నాగగౌడ్ , గౌడ సంఘం పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బాపునగర్‌లో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని బాపునగర్ గ్రామంలో రేపాక వెంకటి ఆధ్వర్యంలో తన తండ్రి రేపాక రాజమల్లు జ్ఞాపకార్థంతో చలివేంద్ర కేంద్రాన్ని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ఏర్పాటు చేశారు. దీన్ని జీపి కార్యదర్శి పద్మావతి ప్రారంభించి మాట్లాడారు. ఎండల పెరిగినందున నిత్యం రాకపోకలు సాగిస్తున్నవారికి దాహార్తి తీర్చుందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జీపి కార్యదర్శి పద్మ వతి, టి ఏ జ్యోతి, సుజాత, రంగమ్మ, లలిత, రాజశేఖర్, కిరణ్, రాజుకుమార్, దానయ్య, శంకర్, రాజు, జీపిసిబ్బంది రాజయ్య, సింహాద్రి, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

తైబజార్, మేకల సంత వేలం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో మంగళవారం తైబజర్ వేలం పాట, వారం సంత, రోజువారి సంత, మేకల సంత వేలంపాట నిర్వహించారు. మేకల సంత వేలంలో ఎల్లారెడ్డి కి చెందిన హుస్సేన్ అనే వ్యక్తి 6లక్షల 55వేల రూపాయలకు దక్కించుకుఆన్నరు. రోజువారి సంత, వారం సంతకు కనీస ధర రానందున గురువారం రోజుకి వాయిదా వేసినట్టు గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్ తెలిపారు.

కార్మికులు క్లైముల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న డెలివరీ మ్యారేజ్ సహజ మరణంకు సంబంధించిన క్లైముల సమస్యలను పరిష్కరించాలని వై ఓమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజామాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఏసీఎల్ శ్రావణి కి అందజేశారు.

ఈ సందర్భంగా వై.ఓమయ్య మాట్లాడుతూ కార్మిక శాఖలో నెలల తరబడి పేరుకుపోయిన డెలివరీ మ్యారేజ్ డెత్‌లకు సంబంధించి క్లైమ్ ల సమస్యలను పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సహజ మరణం, ప్రమాదవశాత్తు మరణాలకు సంబంధించి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను ఆయా మండలాల తహసీల్దార్‌లు మీ సేవ లో ఆన్లైన్లో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, మ్యాన్యువల్ గా మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. కాబట్టి మ్యానువల్‌గా ఇస్తున్న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డెలివరీ మ్యారేజ్ డెత్‌లకు సంబంధించిన వారికి లేబర్ కార్డు రిజిస్ట్రేషన్ రసీదు, రెన్యువల్ రసీదులు తప్పనిసరిగా ఉండాలని చెప్పడం మూలంగా కార్మికులు ఆర్థిక లబ్ధి పొందే అవకాశం కోల్పోతారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు దుబాస్ రాములు మాట్లాడుతూ కామారెడ్డి ఏ సి ఎల్ డెలివరీ మ్యారేజ్ లకు సంబంధించిన క్లెయిమ్ లకు ఒరిజినల్ పేపర్లు తీసుకోవడం వల్ల కార్మికులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే సమస్య ఉందని, కాబట్టి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. న్యాక్ ఆధ్వర్యంలో కోటగిరి గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు శిక్షణ పొంది ఏడు నెలలు గడుస్తున్న నేటికీ కార్మికుల ఖాతాకు డబ్బులు జమ కాలేదని ఆయన తెలిపారు. శిక్షణ పొందిన కార్మికులకు వెంటనే డబ్బులు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


భవన నిర్మాణ కార్మికుల సంబంధించి డెలివరీ మ్యారేజ్ డేత్లకు సంబంధించి చిన్న చిన్న కారణాలతో సెండ్ బ్యాక్ చేయడం వలన కార్మికులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఆగస్టు సెప్టెంబర్ మాసంలో లేబర్ కార్డుకోసం మీ సేవలో ఆన్లైన్ చేసిన వారికి కార్డులు డిలీట్ అయిన వారందరూ లేబర్ ఆఫీసులో మరొక్కసారి తంబ్ పెట్టిన వారికి మీ సేవలో లేబర్ కార్డులు వస్తలేవని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాంలో నల్ల గంగాధర్, ఓల్లెపు గంగాధర్, సోమ వీరేశం, గంపల హనుమాన్లు, శావలం నారాయణ, కప్ప నగేష్, శ్రీనివాస్, చాకలి గంగాధర్, కప్ప సాయిలు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్స్ పాఠశాలలో బ్లాక్ అండ్ వైట్ కలర్ డే సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో బ్లాక్ అండ్ వైట్ కలర్ డే సంబరాలు మంగళవారం నిర్వహించారు. తెలుపు రంగు శాంతికి సూచిక అని, ప్రతి ఒక్కరూ తన లక్ష్యం నిర్ణయించుకొని అదే దిశగా ముందుకెళ్లాలని పాఠశాల కరస్పాండెంట్ టి.వేణు, ప్రిన్సిపాల్ జి ఒడ్డెన్న తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు అన్ని రంగాల్లో డెవలప్మెంట్ అయ్యేలా తల్లిదండ్రులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ కృపా, అనిత , ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పున: ప్రారంభమైన కందకుర్తి ఎత్తిపోతల పథకం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

ఇటీవల కందకుర్తి ఎత్తిపోతల పథకం మోటర్లు చెడిపోవడంతో అర్ధాంతంగా నిలిచిపోవడంతో రైతుల పంట పొలాలు సాగునీరు లేక ఎండు ముఖం పట్టాయి. ఈ విషయం రైతులు ఆయన దృష్టికి తీసుకు వెళ్ళగా అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని మళ్లించారు. అయినప్పటికీ రైతుల అభ్యర్థన మేరకు ఒక మోటర్ మరమ్మత్తులు చేపట్టి దాని ద్వారా కూడా రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రెంజల్ మండల ఉపాధ్యక్షులు గంగాకృష్ణ, ఎమ్మెల్యే రాజు, నీల గ్రామ అధ్యక్షులు సొక్కుల సాయిలు, రైతులు గంగా కిషన్, సాయిలు, సాయన్న, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు, వినియోగంపై అవగాహన

- బషీరాబాద్ లో విద్యుత్ శాఖ- రైతు పొలం బాట



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ లో మంగళవారం విద్యుత్ శాఖ-రైతు పొలం బాట కార్యక్రమంలో భాగంగా రైతులకు విద్యుత్ సమస్యలు, వినియోగం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోగల నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, నిర్మల్, మంచిర్యాల్ పలు జిల్లాల విద్యుత్ హెచ్.టి, ఎల్.టీ వినియోగదారుల విద్యుత్ సమస్యలు పరిష్కారం కోసం సిజిఆర్ ఎఫ్-2 నిజామాబాద్ సంస్థ డిఈ అల్జాపూర్ రమేష్ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధికారులు విద్యుత్ ఫోరం ఏర్పాటు చేశారు. గ్రామానికి విచ్చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక డిఈ అల్జాపూర్ రమేష్, బషీరాబాద్ గ్రామ అభివృద్ధి కమిటీ సమక్షంలో రైతు పొలం బాట, అవగాహన సదస్సు క్షేత్రస్థాయిలో నిర్వహించారు. స్థానిక లైన్మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి రైతులకు విద్యుత్ సమస్యలపై, విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులు విద్యుత్ సరఫరాలో వచ్చే అంతరాయాలు, విద్యుత్ హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్ సమస్యలు, మీటర్ ఆగిపోవుట, విద్యుత్ బిల్లు సమస్యలు, ఇలా విద్యుత్ సరఫరాలో ఎలాంటి సేవాలోపం ఉన్నా ఫోరానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వెంటనే సమస్యకు పరిష్కరించడానికి మేమున్నామని డి.ఈ రమేష్ తెలిపారు.కార్యక్రమంలో ఏఈ శ్రీకృష్ణ కాంత్ , లైన్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు , లైన్ మెన్ చంద్రయ్య గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డి. ఆనంద్, ఉపాధ్యక్షులు పోలీసు రాములు, కోశాధికారి గంగాధర్, సలహాదారు నేరెళ్ల బుచ్చన్న, కమిటీ సభ్యులు మధు, నారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండురోజుల జైలుశిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష పడిందని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ రఘుపతి మంగళవారం తెలిపారు. ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 18న రైల్వే స్టేషన్ దగ్గర బి. రఘుపతి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఒకటో టౌన్ నిజామాబాద్ బృందంతో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా డ్రైవర్స్ కాలనీకి చెందిన షేక్ జమీర్ మద్యం సేవించి బండి నడుపుతూ పట్టుపడగా బ్రీత్ అనలైజర్ ద్వారా చెక్ చేసి మద్యం సేవించినట్లు నిర్ధారించారు. ఆయన్ను న్యాయస్థానం ముందు హాజరుపరచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించగా జైలుకు తరలించినట్టు తెలిపారు. పట్టణ పరిధిలో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే వారికి కూడా ఇదే విధంగా జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. కావున ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని పోలీస్ వారి తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అయ్యేవిధంగా కృషి చేయాలని రైతులు సొసైటీ మహాజనసభలో తీర్మానం చేశారు. మంగళవారం మండలంలోని తాండూర్ కిచ్చన్నపేట సొసైటీ పరిధిలో మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాలని తీర్మానం చేసినట్లు సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రం తాండూర్‌లోని కొనసాగించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ పరిధిలో గల రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

హెల్త్ క్యాంప్‌నకు స్పందన

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిల్లర్గి గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో మంగళవారం హెూలీ స్టిక్ హాస్పిటల్ (హైదరాబాద్) వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంప్‌నకు మంచి స్పందన లభించినట్లు ఆసుపత్రి వైద్య అధికారి ప్రణీత్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 106 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయరాజ్ , వైద్య సిబ్బంది , పంచాయతీ సెక్రటరీ వినోద్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

మండల కేంద్రంలో ఐదు చోట్ల యూటర్న్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి ఏర్పాటులో ఐదుచోట్ల యూటర్న్ ఏర్పాటు చేయాలని గోపాలపేట గ్రామస్తులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో గోపాల్‌పేట్ జాతీయ రహదారి పనుల గుత్తిదారుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఐదు చోట్ల యూటర్న్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ విషయంపై స్పందించిన గుత్తేదారు నారాయణ యూటర్న్ ఏర్పాటుపై ఆలోచన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గోపాల్పేట్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పాక్షికంగా దగ్ధమైన పెంకుటిల్లు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని కోమటి చెరువు తండాకు చెందిన సునావత్ సరిచంద్ పెంకుటిల్లు మంగళవారం ప్రమాదవశాత్తు అగ్నికి పాక్షికంగా దగ్ధమైనట్లు బాధితుడు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఉద్యోగ ప్రిపరేషన్ నిమిత్తం బాన్సువాడకు వెళ్ళగా తన తల్లి వాకిట్లో ఉండగా భార్య పక్కింటి వారింట్లోనే ఉన్నప్పుడు తన పెంకుటిల్లులో అకస్మాత్తుగా ఇంట్లో పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి హుటాహుటిన ఫైర్ ఇంజన్ బాన్సువాడ వారికి సమాచారం అందించి తండావాసులు ముకుమ్మడిగా వచ్చి ఇంటి పై కప్పు పెంకులు మట్టి తీసి వేసి ఇల్లుకు అంటుకున్న మంటలు ఆర్పడంతో ఇల్లు పాక్షికంగా కాలినట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలానికి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను మంగళవారం మండలంలోని మీసేవ, ఆన్లైన్ సేవ నిర్వాహకులు శాలువతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీసేవ ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు రెవెన్యూ అధికారులకు సహకరించాలన్నారు. మీ సేవలో ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా కులముతో పాటు ఆదాయం ఇతర సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాకులు సత్యనారాయణ రెడ్డి, రాజు సుబ్బు, వాజిత్,సాయిలు,తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు


కార్యక్రమాలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

నవతెలంగాణ-సదాశివనగర్

సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్ నందు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు కోర్సు పూర్తి చేసుకుని కళాశాలను వీడుతున్న సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థులు కాలేజీతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. శోభారాణి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాలకు ఆస్తి లాంటి వారని, కళాశాల పేరును నిలబెట్టేవారని తెలిపారు. విద్యార్థులు ప్రతికూలతలను అనుకూలతలుగా మలచుకొని లక్ష్యం దిశగా ప్రయాణించాలని ఆకాంక్షించారు. ఆద్యంతం భావోద్వేగంతో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ సీ హెచ్.మీన, డా. డి.శ్రావణి,అధ్యాపకులు పాల్గొన్నారు.విద్యార్థులు నృత్యాలతో సందడి చేసారు.

ప్రజోపయోగానికి వినియోగించండి

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 31 వ వార్డు ఇస్లాంపూరలో భవాని రోడ్లో ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న స్థలంలో పల్లె ప్రకృతి వనం, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని అభయ జ్యోతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల నంగునూరు లత కోరారు. మంగళవారమిక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 31వ వార్డులో గతంలో మునిసిపల్ కార్మికులు ఉండేందుకు ఇక్కడ గృహాలు నిర్మించారని అందులో ఎవరు లేకపోవడంతో ఆ తర్వాత ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రాథమిక పాఠశాల నిర్మించి విద్యా బోధన చేసే వారని ప్రస్తుతం అది కూడా నడవడం లేదని, ఆ భవనం శిథిలావస్థకు చేరుకుందని ఆ భవనాన్ని తొలగించి ఆ స్థలంలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వార్డు ప్రజలు అనుగుణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని ప్రజావాణిలో సైతం విన్నవించినట్టు తెలిపారు.

సీహెచ్‌సీలో కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-గాంధారి



గాంధారి మండల కేంద్రంలో మంగళవారం కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు కంటి వైద్యాధికారి హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధ పడుతున్న వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు జిల్లా ఆసుపత్రికి సిఫారసు చేశామన్నారు. దృష్టిలోపం ఉన్న వ్యక్తులకు కంటి అద్దాలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

నవోదయకు 'చైతన్య' విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో 5 వ తరగతి చదువుతున్న రామేశ్వర్ పల్లి గ్రామానికి చెందిన రుషద నవోదయలో 6వ తరగతికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రేణు కుమార్, ప్రధానోపాధ్యాయులు అశోక్ యాదవ్ తెలిపారు. నవోదయకు ఎంపికవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున, వేడితో సంబంధమైన ఆరోగ్య సమస్యలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం అని నిజాంసాగర్ మండల వైద్యాధికారి రోహిత్ అన్నారు. వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎంలకు, ఆశ వర్కర్లకు అవగాహన సదస్సును నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేడిని ఎదుర్కొనడానికి ముఖ్యమైన సూచనలు పాటించాలని చెప్పారు. శరీరాన్ని ఎప్పుడు హైడ్రేట్‌గా ఉంచుకోవాలని, దాహం అనిపించకపోయినా తరచుగా నీరు తాగలని కాఫీ, మద్యం, మధుర పానీయాలను అధికంగా సేవించకుండా ఉండాలని సూచించారు. మధ్యాహ్నం 12 - 4 గంటల మధ్యలో ఎక్కువగా ఎండలో ఉండకుండా చూసుకోవాలని బయటికి వెళ్లాల్సి వస్తే తేలికపాటి మెత్తని, తెల్లని రంగు బట్టలు, కళ్లజోడు, వైడ్ బ్రిమ్ హ్యాట్ ధరించాలని చెప్పారు. ఇంట్లో చల్లటి వాతావరణాన్ని కల్పించుకోవాలని ఇంట్లోకి గాలి వచ్చే విధంగా చూసుకోవాలని ఫ్యాన్లు, కూలర్లను ఉపయో గించాలని తెలిపారు. తేలికపాటి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని అత్యధిక మసాలా లేదా వేయించిన ఆహారాన్ని తీసుకోవద్దని వెల్లడిం చారు. ఏదైనా వ్యక్తికి వడదెబ్బ బారిన పడితే తలనొప్పి, అధికంగా చెమట పడడం, బలహీనత, వికారం లాంటి లక్షణాలు ఉంటాయని ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, నీరు ఇచ్చి, అత్యవసర వైద్యసహాయం పొందాలని తెలిపారు. బలహీన వర్గాలు అయిన పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవార వీరికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలిని, పిల్లలు లేదా పెంపుడు జంతువులను కారులో ఒంటరిగా వదలకూడదని కార్ లోపల ఉష్ణోగ్రతలు క్షణాల్లో ప్రమాదకర స్థాయికి పెరిగిపో తాయి కావున ఇది ప్రాణాపాయం కలిగించవచ్చని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.


మాట్లాడుతున్న మండల వైద్యాధికారి

పాఠశాలను సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ అనే కార్యక్రమంలో భాగంగా సజ్జనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయ బృందం జత చేయబడిన సమీపంలో గల శెట్ పల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో జరుగుతున్నటువంటి వివిధ రకాలైన కార్యక్రమాలను నేరుగా విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఐఎఫ్‌బీ పనితీరు, నిర్వహణ ఉన్నత పాఠశాల సమయపాలన లైబ్రరీ నిర్వహణ, క్రీడా ప్రాంగణము, క్రీడల నిర్వహణ, సైన్స్ ల్యాబ్ నిర్వహణ గణిత ల్యాబ్ నిర్వహణవంటి అంశాలను పరిశీలించారు. అలాగే ఉన్నత పాఠశాలలోని వివిధ రకాలైన సబ్జెక్టు టీచర్స్ ఇంగ్లీష్, తెలుగు, హిందీ, గణితం, సామాన్య మరియు సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులను మౌలిక విషయాలను గురించి ఉపాధ్యాయుల బోధన అనంతరం పలు రకాలైన ప్రశ్నలు వేసి వారితో వారి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సజ్జనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న, శెట్ పల్లి సంగారెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషయ్య, ఉపాధ్యాయులు పర్వయ్యతో పాటు వారి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


స్కూల్‌ను సందర్శించిన విద్యార్థులు

మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-తాడ్వాయి/లింగంపేట్/రామారెడ్డి

ఎలారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకల్లో భాగంగా మండలంలో శబరి మాత ఆశ్రమంలో పూజ నిర్వహించారు. ఎర్రపాడు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు వెల్మ సంతోష్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కపిల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మూదం నరసింహులు, మండల యూత్ అధ్యక్షులు రమేష్ రావు, మంగారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డి, భాస్కర్ రెడ్డి బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని ఎర్రపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రోగులకు పండ్ల పంపిణీ చేసినట్లు బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు వెల్మ రవీందర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలు జరుపుకొని అనంతరం ఎర్రపాడు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు రమేష్ రావు, దే మీరాజిరెడ్డి, ప్రభాకర్ రావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రామారెడ్డి: చెక్ కట్ చేస్తున్న నాయకులు

లింగంపేట్: ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలు మంగళవారం మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అదే విధంగా ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు దివిటి రమేష్ మాట్లాడుతూ సురేందర్ ఆయురారోగ్యాలతో ఉండాలని మరిన్ని జన్మదిన వేడుకలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఐదు సంవత్సరాలు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సింగిల్ విండో చైర్మన్ నరసింహులు, పార్టీ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, సతీష్ ఇమ్రాన్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, మాజీ ఎంపీటీసీలు ఘనునాయక్, విట్టల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండల కేంద్రంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలను బి ఆర్ ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి, మండల రైతు సమన్వయ కమిటీ మాజీ కన్వీనర్ గురజాల నారాయణరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పడిగల శ్రీనివాస్, సతీష్ గుప్తా, కిరణ్ కుమార్ రెడ్డి, భానూరి నర్సారెడ్డి, చందర్ నాయక్, కడెం శ్రీకాంత్, పోతూ నూరి ప్రసాద్, జంగం లింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు.. పరిశీలన

పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్/తాడ్వాయి/లింగంపేట్

భిక్కనూరు పట్టణ కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ ప్రాంగణ ఆవరణలో సీసీ రోడ్డు పనులు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సహకారంతో ఎస్ ఆర్ జి ఎస్ నిధుల ద్వారా 30 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, లింబాద్రి, మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో మంగళవారం 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీకి గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : సీసీ రోడ్డు నిర్మాణం పనులు నాణ్యత చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రాజారామ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన 20 లక్షల నిధులతో చేపడుతున్న నిర్మాణం పనులను పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని.. అనంతరం వాటర్ క్యూరింగ్ చేయించాలని సూచించారు. కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు కృష్ణ జవాడి గ్రామంలో ఫ్యామిలీ అడాప్షన్లో భాగంగా చేపడుతున్న సర్వేను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, సీనియర్ అసిస్టెంట్ హనుమాన్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

లింగంపేట్: లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న పనులను మంగళవారం మండల అభివృద్ధి అధికారి నరేష్ పరిశీలించారు. బాయంపల్లి బాణాపూర్ బోనాలు గ్రామాల్లో జరుగుతున్నటువంటి ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మస్టర్లను పరిశీలించారు. ప్రతి కూలికి పని కల్పించాలన్నారు. అదేవిధంగా నర్సరీలు పరిశీలించారు. మొక్కలు వాడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. ఉదయం సాయంత్రము మొక్కలకు నీరు అందించాలన్నారు. మండల కేంద్రంలో బీసీ కాలనీ జరుగుతున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, వహాబ్ రాజు, నగేష్, కాలనీవాసులు ఉన్నారు.


తాడ్వాయిలో పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

కృష్ణాజివాడిలో ఇంటింటి సర్వే

నవతెలంగాణ-తాడ్వాయి



కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు మండలంలోని కృష్ణజివాడి గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. అడాప్షన్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యల పైన వివరాలు సేకరిస్తూ తగిన జాగ్రత్తలు తెలియజేయడానికి మూడు రోజుల కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

- ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

ఆర్థిక సంవత్సరం చివరినాటికి మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ప్రతి గ్రామంలో గ్రామస్తులు ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో సూచించారు.

అక్రమంగా నల్ల మట్టి తరలింపు

- పట్టించుకోని అధికారులు


ట్రాక్టర్‌లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాస్లాబాద్ గ్రామ చెరువులో నుండి నల్ల మట్టి తరలిపోతోంది. మూడు రోజుల నుండి రెండు జేసిబిలు, దాదాపు 20 ట్రాక్టర్‌ల సహాయంతో నల్లమట్టి తోడుకుంటు తరలిస్తున్నారు. చెరువులో నుండి నల్ల మట్టిని రైతులు కానీ ఇతరులకు అవసరం ఉంటే ఆ శాఖల నుండి అనుమాతులు తప్పని సరిగా తీసుకొని నల్ల మట్టిని తీసుకోపోకాలని ఒక నిబంధన ఉంది. కానీ కొందరు వ్యక్తులు అక్రమంగా నల్ల మట్టిని జేసిబిల సహాయంతో అక్రమ వ్యాపారం చేసుకొని డబ్బులు సంపాదించు కోవలని అక్రమాలకు పాల్పడుతున్నట్లు జనాలు ఆరోపిస్తున్నారు. పెద్ద మొత్తంలో నల్ల మట్టి అక్రమంగా తరలిపోతున్నా అధికారులు మాత్రం చెరువు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు మట్టిని అక్రమంగా తరలిపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజ్ఞోత్సవాలు విజేతలకు బహుమతులు ప్రదానం


ప్రశంసాపత్రాలు అందజేసిన డీఈవో రాజు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని విద్యాధికారి కార్యాలయంలో వివిధ పాఠశాల సముదాయాల స్థాయి నుండి మండల స్థాయిలో వ్యాసరచన, ముఖాముఖి, లిఖిత పోటీలను నిర్వహించారు. ఈపోటీలను గెలు పొందిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి రాజు చేతుల మీదుగా మండల స్థాయిలో వివిధ విభాగలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 16 మంది విద్యార్థులకి మొదటి, ద్వితీయ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీహరి, ప్రధానోపాధ్యాయులు రంగా వెంకటేశ్వర్ గౌడ్, ఉపాధ్యాయులు మల్లేష్, శ్రీనివాస్ , రంగారావు , కుమారస్వామి ఉపాధ్యాయులు ప్రకాష్, స్వామి పెంటయ్య, సిఆర్పీలు ప్రసాద్, రామారావు, రాజు, షహీద్ , సాయిలు, కవిత విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-భిక్కనూర్

జిల్లా ఎస్పీ విజయచంద్ర ఆదేశాల మేరకు మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న కేజీబీవీ బాలికల విద్యాలయంలో కామారెడ్డి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉండాలని, షీటీం, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. షీటీం నెం 8712686094, సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల టోల్ ఫ్రీ 100, 108, 1930, 181 నెంబర్ల గురించి వివరించారు. ప్రతి మహిళ ఫోన్ నందు 'టీ-సేఫ్ యాప్' డౌన్‌లోడ్ చేసుకోవాలని ఇది మహిళలకు చాలా అత్యవసరమైనదన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మాదకద్రవ్యాల వినియోగాన్ని అందరూ మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, భిక్కనూర్ పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రత్యేక అధికారిని హరిత పాల్గొన్నారు.

తైబజారు వేలం పాట వాయిదా


తైబజార్ వేలం పాటకు హాజరైన పలువురు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారిని జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో తైబజార్ వేలం పాటను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దోమకొండ గ్రామపంచాయతీ లో రెండవసారి తైబజారు వేలం పాట నిర్వహించగా ప్రభుత్వ నిబంధన ప్రకారం తక్కువ ధర పడడంతో వాయిదా వేశామని, మూడవసారి వేలం పాటను శుక్రవారం రోజున నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

లుకేమియాతో బాధపడుతున్న

స్నేహితుడి కోసం విరాళం సేకరణ



నవతెలంగాణ-నందిపేట్ (డొంకేశ్వర్)

డొంకశ్వర్ మండలంలోని గంగసముందర్ గ్రామానికి చెందిన నిర్వీన్ తేజ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్నాడు. నిర్వీన్ తేజ్ యస్.యస్.వి తొండకూర్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తోటి స్నేహితుడి ప్రాణాలు కాపాడుకోవడం కోసం పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, విద్యార్థులు బాలుడి వైద్యం కొరకు రూ.2లక్షలు విరాళాలు సేకరించి బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ జి.చిరంజీవి, హెడ్‌మాస్టర్ నరేష్, అకాడమిక్ ఇంచార్జ్ స్వామి పాల్గొన్నారు.

పాఠశాలల్లో టీచర్లకు కుర్చీలు లేవు



ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు కూర్చోవడానికి కుర్చీలు లేవని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 48 పాఠశాలల్లో బాత్రూములు లేవన్నారు. 104 క్లాస్ రూములు, కిచెన్ షెడ్లు 48, పిల్లలు కూర్చోవడానికి డెస్కులు లేవన్నారు. 126 స్కూళ్లకు పెయింటింగ్స్ లేవని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. డ్రాప్ అవుట్స్ కు కారణాలు వెతకాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించానని అన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించానన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలన్నారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్ రూరల్

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ముచ్కూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ సెంటర్‌లలో పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, విద్యార్థుల బోధన, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం మండలంలోని పల్లికొండ, బడా భీంగల్ గ్రామాల్లో వేసవి కాలం దృష్ట్యా చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇట్టి చలివేంద్రాలను ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో జావీద్ అలీ, కార్యదర్శులు రామ్మోహన్, రజిత, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు



నిధులు కాపీని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్, వేంపల్లి గ్రామాలకు ఎంపీ లాడ్స్ నిధులు మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్ రెడ్డి మంగళవారం తెలిపారు. మంజూరైన నిధుల ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు అందజేశారు. మండల కేంద్రంలోని ధూల గుట్ట దగ్గర నూతనంగా నిర్మిస్తున్న 'శుక్రవారం గుడి' అమ్మవారి ఆలయం అదనపు గది నిర్మాణనికి రూ.4 లక్షలు, వేంపల్లిలో ఎస్సి కమ్యూనిటీ హాల్ నిర్మాణనికి రూ.3.5 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. నిధులు మంజూరు చేసిన జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ కు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షులు చిల్క దినేష్, మ్యాక నర్సయ్య, సాగర్, గోపినాథ్, విక్రమ్, బద్దం హన్మాండ్లు, నవీన్, గైని శ్రీనివాస్, లోక రాములు, కింగ్స్ గంగాధర్, కంచు గంగాధర్, కంచు విజయ్, బొట్ల చిన్న రాజన్న తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలం లోని గోవింద్‌పేట్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి సుకన్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా పెరుగుతున్న ఎండల కారణంగా ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, కౌశిక్, మురళి, సాయికుమార్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని కిసాన్‌నగర్‌లో లయన్స్ భవనంలో లయన్స్ క్లబ్ బాల్కొండ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. నిజామాబాద్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రవళిక పరీక్షలు నిర్వహించి మోతిబిందు ఉన్న వారిని శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించినవారికి సన్మానం



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన యెంగంటి ప్రవీణ్‌గౌడ్ జూనియర్ లెక్చరర్‌గా, బూస మారుతి, శేర్ల రమలత ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. మంగళవారం వందేమాతరం సేవా సమితి ఆధ్వర్యంలో వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజేందర్‌గౌడ్, సెరియాల జగన్, అంబటి నవీన్, ఆరెపల్లి రాజేశ్వర్, కుందారపు శ్రీనివాస్, విజయ్ కుమార్, రాము, రామకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, మధు, కాలరవి, అంబటి కిషన్, సంతోష్, సల్ల నర్సయ్య , యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇందూర్‌లో మినీ ఇండోర్ స్టేడియం నిర్మించాలి : ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇందూర్‌లో మినీ ఇండోర్ స్టేడియం నిర్మించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ అన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పద్దులపైన చర్చలో ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు 87,235 ఎకరాల దేవాదాయ భూములు ఉండేవని తెలిపారు. తెలంగాణ వచ్చిన తరువాత 20,124 ఎకరాల దేవాదాయ భూములు కబ్జాకు గురి అయితే, కేవలం 1146 ఎకరాలకు మాత్రమే కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. కేవలం 190 బడ్జెట్‌తో వాటి అభివృద్ధి ఏ విధంగా సాధ్యమో ప్రభుత్వం సమాధానం చెప్పాలని తెలిపారు. దేవాలయాలు అన్ని కూడా పర్యవేక్షణలో ఉంచి వాటి కోసం ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇందూరు నగరంలోని ఆరుఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఉన్న పాత కలెక్టరేట్ స్థలం అనుకోని ఉన్న గ్రౌండ్‌ను మినీ స్టేడియంగా నిర్మించాలన్నారు. అలాగే పాత ఇరిగేషన్ భవనం యొక్క రెండు ఎకరాల స్థలంలో ఇన్డోర్ స్టేడియం నిర్మించాలని పేర్కొన్నారు.

పోరాటంతోనే సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- జై అంబానీ, జై ఆదాని అంటున్న మోడీ
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభల సందర్భంగా ర్యాలీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైతాంగ పోరాటం ద్వారానే వ్యవసాయ రంగ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, రైతులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ మహాసభలు నిజామాబాద్ నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నుంచి ర్యాలీ ప్రారంభం కాగా పూలాంగ్ చౌరస్తా మీదుగా గోనె రెడ్డి ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించారు. ఈ రైతు ర్యాలీలో పాల్గొన్న రైతులపై పువ్వులుచల్లి ఆహ్వానం పలికారు పులాంగ్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గోనె రెడ్డి ఫంక్షన్ హాల్లో బహిరంగ సభ నిర్వహించారు. ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆహ్వాన సంఘం కోశాధికారి కంజర భూమయ్య సభ అధ్యక్షత వహించారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లి కంటి సత్యం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంత రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులను విస్మరించిందని, మూడు నల్ల చట్టాలను తెచ్చి రైతులను నిండా ముంచిందన్నారు. చారిత్రాత్మకమైన రైతుల పోరాటాల ఫలితంగానే మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు రద్దు చేయబడ్డాయని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్లకు కొమ్ము కాస్తుందని అన్నారు. పేద మధ్యతరగతి రైతులకు న్యాయం జరిగేలా చట్టాలు రూపొందించడం లేదని తెలిపారు. పసుపు బోర్డు తెస్తామని చెప్పి ఎంపీ గా గెలిచిన ధర్మపురి అరవింద్, ఎట్టకేలకు పసుపు బోర్డు ఇచ్చిన పసుపుకు మద్దతు ధర ఇవ్వలేక రైతులను మోసం చేస్తున్నారన్నారు. పసుపు మద్దతు ధర ఇవ్వకుండా రైతులు రోడ్డుకెక్కే పరిస్థితి ఏర్పడేలా చేశారన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతిరోజు దాదాపు 36 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం వల్లనే రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రపంచ దేశాల్లో వ్యవసాయానికి సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంటే, మోడీ ప్రభుత్వం మాత్రం సబ్సిడీలు ఇవ్వకుండా, అంబానీ ఆదానిలాంటి కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతున్నా యన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం సాగునీటి కోసం ఏ ఒక్క ప్రాజెక్టును కూడా సంపూర్ణంగా నిర్మించలేక పోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ విభజన చట్టంలో తెలంగాణలో ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించలేదని అన్నారు. ఉత్తర భారతదేశంలో ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే జాతీయ హోదా కల్పించి, నిధులు విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో సైతం కృష్ణ నదిలో వాటా తేల్చక పోవడంతో ఆంధ్రకు నీళ్ళు దోచుకుపోతున్నారని గుర్తు చేశారు. భాగం హేమంతరావు, పశ్య పద్మ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసి కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ఆకర్షితులై ప్రజలు ఓట్లు వేశారని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేర్చాలన్నారు. రెండు లక్షల రుణ మాఫీ, రైతు భరోసా పూర్తిగా అందలేదని, పసుపు, మిర్చి, వరి పంటకు గిట్టుబాటు ధర అందడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల తెలంగాణ జిల్లాలో వడగళ్ల వానతో తీవ్రంగా పంట నష్టం జరిగిందని, ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మోడీ ప్రభుత్వం 16 లక్షల కోట్ల రూపాయలు అంబానీ, ఆదానీ అప్పులు మాఫీ చేశారని, రైతులకు మాత్రం మేలు జరిగే పనులు చేయడం లేదన్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు నర్రా రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అడ్డికే రాజేశ్వర్ మరియు రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర జిల్లా నాయకులుచ ఆహ్వాన సంఘం నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న నాయకులు, రైతులు

బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అవమానిస్తోంది

- జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ సన్నాహక సమావేశంలో కాంగ్రెస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి

బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తోందని ప్రతి ఒక్క కార్యకర్త ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉంటూ ప్రజలను జాగృతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి, ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఇందల్ వాయి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి రాహుల్‌గాంధీ పిలుపు నిచ్చారని తెలిపారు. ఈనెల 27 నుండి పాదయాత్ర ప్రారంభిస్తామని అన్నారు.



డిచ్‌పల్లిలో..

కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి ఆనంద్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షులు ఎల్ ఐ సి గంగాధర్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజన్న, మాజీ ఎంపిటిసి చింతల కిషన్, గంగాధర్ గౌడ్,బోర్ వెల్ రాజేందర్ రెడ్డి,జంగిలి లక్ష్మీ, దశరథ్,బైరయ్య, సుధాకర్ నాయక్, సి హెచ్ గంగా దాస్, నాయకులు, కార్యకర్తలు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ సమావేశం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించారు. ఈనెల 27 నుంచి ఏప్రిల్ 4 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న బ్రాహ్మణపల్లి, తొర్లికొండ, కొలిప్యాక్, 28న కలిగోట్, మనోహరాబాద్, చింతలూరు, 29న పడకల్ సికింద్రా పూర్, కేశ్‌పల్లి, 31న బాలనగర్, మాదాపూర్, పుప్పాలపల్లి, ఏప్రిల్ 2న మునిపెల్లి, లక్ష్మాపూర్, నల్లగుట్ట తండా, ఏప్రిల్ 3న అర్గుల్, నారాయణపేట్, ఏప్రిల్ 4న జక్రాన్‌పల్లి, జక్రాన్‌పల్లి తండా, పడకల్ తండాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఇందూరు తిరుమల 11వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈసందర్భంగా దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి ప్రవచనాలు చేశారు. ఆలయ పుష్కరిణిలో స్వామివారికి చక్ర స్నాన కార్యక్రమాన్ని వేద పండితులు, అర్చక స్వాములు నిర్వహించారు. సాయంత్రం శ్రీపుష్ప యాగం" కార్యక్రమాన్ని నిర్వహించారు. మనిషికి ప్రకృతి పట్ల ప్రేమ, దేశ భక్తి ఉండాలని అన్నారు. కార్యక్రమాల్లో ప్రముఖ నిర్మాత ఆలయ ధర్మకర్తలు నర్సింహ్మా రెడ్డి దంపతులు, దిల్ రాజు దంపతులు, శిరీష్ రెడ్డి దంపతులు, విజయసింహా రెడ్డి దంపతులు, హరీష్ దంపతులు, సుధర్శన్ రెడ్డి దంపతులు, నరాల సుధాకర్, పృథ్వీ, యాజ్ఞాచార్యులు శిఖామణి శర్మ, సత్యన్నారాయణ ఆచార్యులు, శ్రీకరాచార్యులు, రోహిత్ కుమారాచార్యా విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెల్ఫ్ గవర్నమెంట్ డే

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని బస్సాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా విధులను నిర్వర్తిస్తూ పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజారాం మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోయడ నర్సయ్య, సాయన్న, రమాదేవి, తిరుపతి పాల్గొన్నారు.

బి-గ్రేడ్‌కు పడిపోవడం రైతులకు నష్టం

- నిలదీతల మధ్య సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సహకారం సంఘం సర్వసభ్య సమావేశం నిలదీతల మధ్య రసాభాసగా సాగింది. ఏ గ్రేడ్ నుండి బి-గ్రేడ్‌కు పడిపోవడం నష్టమని రైతులు ఆరోపణలు చేశారు. ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి సహకార సంఘం సర్వసభ సమావేశాన్ని మంగళవారం చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇందల్ వాయి సహకార సంఘం బి-గ్రేడ్‌కు పడిపోవడం ఆందోళనకరంగా ఉందని పలువురు రైతులు చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డిని నిలదీశారు. లాభాలంఎ నడిచే సహకార సొసైటి అప్పుల ఊబిలో చిక్కుకోవడం విడ్డూరంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘం జిల్లాలో రెండవ స్థానంలో ఉండేదని ప్రస్తుతం అట్టడుగు స్థానానికి పడిపోవడానికి కారణాలను వివరించాలని రైతులు పట్టు పట్టడంతో చైర్మన్ రైతులతో పాటు డిసిసిబి డైరెక్టర్ ఆనంద్‌తో తీవ్ర వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్త వాతావరణానికి కారణం అయింది. డిసిసిబి డైరెక్టర్ ఆనంద్ ప్రసంగానికి సైతం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తోపాటు పాలకవర్గ సభ్యులు అడ్డు చెప్పడంతో ఆయన ఒకింత ఆవేదనకు గురై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. డిసిసిబి డైరెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జీవో నెంబర్ 52ను అమలు చేసి విచారణ నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించగా చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తమ గ్రామ పరువు పోతుందని చైర్మన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో డిసిసిబి డైరెక్టర్ ఆనంద్ తను కూడా గ్రామానికి చెందిన వ్యక్తినని తనకు సొంత గ్రామంపై మమకారం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలోని 1400 పై చిలుకు సభ్యులుగా ఉన్న సహకార సంఘం నేడు దివాలా తీస్తుంటే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సహకార సంఘంలో నిధులు అక్రమంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు రాగా డిసిసిబి అధికారులు విచారించగా ఏడు లక్షల రూపాయలు నిధులు రికవరీ చేసినట్లు డిసిసిబి డైరెక్టర్ ఆనంద్ రైతులకు వెల్లడించారు. అలాగే 52 యాక్ట్ ప్రకారం విచారిస్తే భవన నిర్మాణంలో జరిగిన అవకతవకలు బయటకు వచ్చే అవకాశం ఉందని రైతులు పట్టుబట్టారు. దీంతో చైర్మన్ ఏకీభవించకుండా 52 జీవో ప్రకారం విచారణ జరిపించే ప్రసక్తే లేదని వెల్లడించారు. చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తో పాటు డిసిసిబి డైరెక్టర్ ఆనంద్ కు మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీయగా రైతులు సమస్య జటిలమవుతుందని గ్రహించి సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శాశ్వత ఆదాయం కోసం భవనాలు నిర్మిస్తున్నప్పుడు కొంత ఒడిదురుకులు సహజమేనని వివరించారు. జి ఓ 44 ప్రకారం వర్కర్లకు జీతాలు ఇవ్వడం జరుగుతుందని ప్రతినెలకు 1,62,000 వేతనం కిందనే ఉద్యోగులకు ఇవ్వవలసి వస్తుందని వెల్లడించారు. ఇలాంటి అనేక కారణాల వల్ల సహకార సంఘం అప్పుల పాలు అయిందని ఆయన అన్నారు. సహకార సొసైటీ సిఈవో వ్యవహరిస్తున్న తీరు వల్లే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు రైతులు ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మారుతి నాయక్. డైరెక్టర్లు మల్లారెడ్డి, నామాల గంగారం, రామ్ రెడ్డి, చందర్ నాయక్, లోకాని గంగమణి, రైతులు పాల్గొన్నారు.

సోదర భావానికి ప్రతీక రంజాన్

- ఇందల్‌వాయిలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

సోదర భావానికి ప్రతీకగా రంజాన్ నిలుస్తుందని తాహసిల్దార్ వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ముస్లిం సోదరులకు దావత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించామన్నారు. మంగళవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని గంగారం తండా సమీపంలోని మోహమ్మదియ మస్జిద్‌లో ప్రభుత్వం దావత్ -ఏ-ఇఫ్తర్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాహసిల్దార్ వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇఫ్తార్ విందు భోజనం లో పాల్గొనడం సంతోషదాయకం అన్నారు. అంతకు ముందు హాఫిజ్ -ఏ-ఖురన్ (మౌల్వి సాబ్) అమేర్ రంజాన్ మాసం విశిష్టతను వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశాలతో ముస్లిం సోదరులకు దావత్ -ఏ-ఇఫ్తర్ విందు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఖాజా మియా, అహ్మద్ ఖురేషి, తాహెర్ అలీ, అమీరొద్దిన్, కాంగ్రెస్ నాయకులు హబీబ్, ఆశిష్, జామిల్ పాషా, మైబూబ్ అలాం, అబ్దుల్ గఫర్, షేక్ కరీం, మాలంగ్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజన్న, సిహెచ్ గంగా దాస్, తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల ద్వారా విధులు నిర్వహించాలి

- బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఖమ్మం, వరంగల్ తదితర మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీల తరహాలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇంజనీరింగ్ సెక్షన్‌లోని వాటర్ సప్లై, ఫిల్టర్ బెడ్స్, స్ట్రీట్ లైట్స్, గార్డెన్స్, శానిటేషన్ విభాగంలో డ్రైవర్స్, శానిటేషన్ జవాన్లు, స్లీపర్స్, డ్రైనేజ్ క్లీనింగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్స్, సూపర్ వైజర్స్, బిల్ కలెక్టర్స్, కార్పొరేషన్ కార్యాలయం సిబ్బంది తదితరులను ఔట్ సోర్సింగ్ కార్మికుల సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లద్వారా నిర్వహించాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో దండి వెంకట్, బిఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన ఎస్ సిద్ధి రాములు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వడం వల్ల సంవత్సరానికి 30 లక్షల రూపాయల ఆదాయాన్ని కార్పొరేషన్ నష్టపోతుందదని చెప్పారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 434 మంది 14 సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల ద్వారా ఎలాంటి కమిషన్ లాభాపేక్ష లేకుండా పని చేస్తున్నారని, దీంతో మున్సిపల్ కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ: 15,10,320 రూపాయల ఆదాయం లబ్ది చేకురుతుందన్నారు. మిగిలిన దాదాపు 709 మంది కార్మికులు హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్లు టెండర్ల ద్వారా సంవత్సరానికి 30 లక్షల రూపాయల కమిషన్ పొందుతున్నారని తెలిపారు. ఈటెండర్లు రద్దుచేసి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లను ఏర్పాటు కార్మికులకే పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, వాటర్ సెక్షన్ యూనియన్ సీనియర్ నాయకులు ఆర్. మురళి, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఎం.ఎల్లయ్య నవిన్, వీలిన గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు సాయిలు, ప్రశాంత్. బిఎల్ టీయూ నగర అధ్యక్షులు అనిల్ జిల్లా నాయకులు నాయకులు జె.విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

26న ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమావేశం

నవతెలంగాణ-మద్నూర్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈనెల 26న మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించనున్నట్టు మండల అభివద్ధి అధికారి రాణి, ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి పద్మ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సామాజిక తనిఖీ కార్యక్రమంలో 1-4-2023 నుంచి 25-3-24 వరకు పనులపై సామాజిక తనిఖీలు పరిశీలించనున్నట్టు తెలిపారు. ఈనెల 15 నుంచి 25 వరకు సామాజిక తనిఖీ నందు గ్రామ సోషల్ ఆడిటర్లు, డిఆర్పీలు, సంబంధిత ఎస్ఆర్పీలు, ఆధ్వర్యంలో గ్రామాలలో సర్వేలు నిర్వహించి గ్రామసభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 26న మండల స్థాయి 15వ సామాజిక తనిఖీ సమావేశం ఏర్పాటు చేసినట్టు ఇట్టి సమావేశానికి మండలంలోని గ్రామ కార్యదర్శులు పోస్టల్ అధికారులు టెక్నికల్ అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లు సకాలంలో హాజరుగా కావాలని ఎంపీడీవో, ఏపీవో కోరారు.

న్యాయవాది హత్యపట్ల బార్ నిరసన

- న్యాయవాద ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటుకు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రంగారెడ్డి బార్ అసోసియేషన్ న్యాయవాది ఎర్రబాపు హత్యను నిరసిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించినట్టు బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్ తెలిపారు. మంగళవారం జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్‌లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఎర్రబాపుకు నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సంతాప సందేశం పంపిటన్టు తెలిపారు. హత్యకు నిరసనగా న్యాయస్థానాలలో కోర్టు విధులకు దూరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎర్రబాపు హత్యపై సమగ్ర విచారణ జరిపి హంతకులను చట్టంముందు దోషులుగా నిలబెట్టాలని జగన్ కోరారు. హత్యల పరంపర ఆగాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం సమగ్రంగా తయారు చేయాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వసంత్ రావ్, ఉపాధ్యక్షులు పెండం రాజు, దొంపల్ సురేష్, కార్యదర్శి ఏ.దీపక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాజేందర్, న్యాయవాదులు విఘ్నేష్, పడేగేల వెంకటేశ్వర్, బిట్లా రవి, పిల్లి శ్రీకాంత్, ప్రేమ్ కుమార్, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ మారుతి మందిరం దేవాదాయ ధర్మాదాయ శాఖ పాలక మండలి చైర్మన్ రామ్ పటేల్ జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావును కలిసి శాలువాతో సన్మానించి, స్వీట్లు తినిపించి కతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నూతన చైర్మన్‌గా ఎంపికైన రామ్ పటేల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాయి పటేల్, సీనియర్ నాయకులు హనుమాన్లు స్వామి, విట్టల్ గురూజీ పాల్గొన్నారు.

రూ.9 లక్షల 43 వేలకు

- సాటాపూర్ తైబజార్ వేలం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ తై బజార్‌ను మోహిన్ అనే వ్యక్తి 9 లక్షల43 వేల రూపాయలకు దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే 12 వేల రూపాయలు తగ్గాయని గ్రామ కార్యదర్శి మహ బూబ్ అలీ పేర్కొన్నారు. ఇటీవల మండల కేంద్రమైన రెంజల్, కళ్యాపూర్, ఫకీరాబాద్, గ్రామాల్లో నూతనంగా కూరగాయల మార్కెట్లు వెలవడంతో క్రేయ విక్రయదారులు గణనీయంగా తగ్గారని దీంతో వేలంపాటలో వ్యాపారులు ముందుకు రాలేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ అశోక్ కుమార్, కరోబార్ మంగురాం, అటెండర్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలోని గండి ముందట గుట్ట వద్ద కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీల హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేసి, కూలీల హాజరు తీసుకున్నారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒకరు వేసవిలో ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. కూలీలు ఎండ నుండి సేద తీరేందుకు టెంట్లను, వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పని ప్రదేశంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పని కల్పించాలని ఈజిఎస్ అధికారులను ఆదేశించారు.ప్రతి ఉపాధి కూలికి చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, ఫీల్డ్ అసిస్టెంట్, మెట్లు, తదితరులు ఉన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షునిగా గోపాల్ నాయక్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని కారేపల్లి గ్రామ, ఆలయ కమిటీ అధ్యక్షునిగా బాధవత్ గోపాల్ నాయక్ బాధ్యతలు తీసుకున్నారు. గ్రామానికి చెందిన వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మంగ్యానాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి తావురియా నాయక్, బాధవత్ బాబులాల్, రవి నాయక్, గోవింద్ నాయక్, కారేపల్లి గ్రామశాఖ అధ్యక్షులు రమేష్, గంగాధర్, రవి, వెంకట్రాం, పరశురామ్, గంగాధర్, గోవింద్, కిషన్, దాస్, సంతోష్, వెంకటేష్, రాజేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన వారిని పూల మాల, శాలువాతో సత్కరించారు.

ఎస్సారెస్పీ ప్రాంతాన్ని టూరిజం స్పాట్ చేయాలి

- నాక్ సెంటర్ పనులు కొనసాగించాలి
- శాసనసభలో నియోజకవర్గ సమస్యల్ని ప్రస్తావించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం రోడ్లు భవనాల శాఖ, టూరిజం, ఎండోమెంట్, స్పోర్ట్స్ శాఖల పద్దులపై చర్చ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. బాల్కొండ నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఉపాధి కొరకు గల్ఫ్‌కి వెలుతారని, అక్కడ చిన్న జీతాలకు లేబర్ పని మీద వెళ్తుంటారన్నారు. ఏదైనా స్కిల్ వర్క్ నేర్చుకొని వెళ్లినట్లైతే వారికి జీతం ఎక్కువగా దొరుకుతుందన్న ఉద్దేశ్యంతో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడానికి బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండల కేంద్రంలో రూ.5 కోట్లతో నాక్ సెంటర్ నిర్మాణం కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిదులు మంజూరు చేశామన్నారు. కొబ్బరికాయ కొట్టి, టెండర్ కూడా పూర్తి అయ్యిందని సభ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మంత్రి ఆ పనిని రద్దు చేశారని, దానిని కొనసాగించి పనులు మొదలయ్యేలా చూడాలని కోరారు.

ఎస్సారెస్పీని టూరిజం స్పాట్ చేయాలి..

నియోజకవర్గంలో ఉన్న శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ షోర్‌లో బ్రహ్మాండమైన ఐలాండ్స్, చూడదగ్గ ప్రదేశాలు, అనేక జీవ జీవజాతులు ఉన్నాయని సభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి. ఈ ప్రాంతాన్ని మంచి టూరిజం స్పాట్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే ప్రతిపాదనలు చేసామని, నీటిపారుదల శాఖ భూములను టూరిజం వారికి బదిలీ చేసామని ప్రస్తావించిన ఆయన, ఆ ప్రతిపాదన ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ఇంచార్జ్ మంత్రి జూపల్లి దృష్టికి సభ ద్వారా తీసుకువచ్చారు. వెంటనే ఆ ప్రతిపాదనను మంజూరు చేసి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు బ్యాక్ షోర్‌ను మంచి టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పైన బాసర సరస్వతి పుణ్యక్షేత్రం ఉంటుందని, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి బాసర దేవాలయం వరకు ఎప్పుడు నిండుగా నీరు ఉంటుందని సభలో తెలిపారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి బాసర వరకు టూరిజం అభివృద్ధి చేసేలా ఒక బోటు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నియోజకవర్గంలో దేవాలయల పనులు పూర్తి చేయాలి..

నియోజకవర్గంలో గత పది ఏండ్లలో 52 దేవాలయాలు నిర్మించామని, ఇంకా 35 దేవాలయాలు మంజూరు అయ్యి వివిధ దశలలో ఉన్నాయని ప్రస్తావించారు. 8 దేవాలయాలు పనులు జరుగుతూ బిల్స్ రాక పనులు నిలిచిపోయాయని తెలిపారు. టెండర్ అయ్యి అగ్రిమెంట్‌లు కానీ దేవాలయాలు 9 ఉన్నాయని, మంజూరు అయ్యి టెండర్‌లు పిలవాల్సిన దేవాలయాలు 17, వివిధ దశల్లో ఆగి ఉన్న వీటన్నింటిని క్లియర్ చేయాలని కోరారు.

మినీ స్టేడియానికి కాంపౌండ్ వాల్ నిర్మించాలి..

నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లిలో క్రీడాకారుల కోసం గత బిఆర్ఎస్ హయాంలో నిధులు మంజురు చేసి మినీ స్టేడియం నిర్మించామని సభ దృష్టికి తీసుకువచ్చారు. స్టేడియానికి కాంపౌండ్ వాల్ లేక అసాంఘిక పనులు జరుగుతున్నాయని, కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రద్దు చేసిన పనులన్నీ తిరిగి చేపట్టాలి..

రోడ్లు భవనాల శాఖ ద్వారా నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో మంజూరై కొనసాగుతున్న పనులు మందకొడిగా సాగుతున్నాయి, ఏజెన్సీలకు పెండింగ్ బిల్లులు చెల్లించి ఆన్ గోయింగ్ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో మంజూరైన అనేక పనుల్ని ఈ ప్రభుత్వం వచ్చాక రద్దు చేసిందని సభలో ప్రస్తావించారు. వెంటనే కాకున్నా రానున్న 3 సంవత్సరాల కాలంలో ఆ పనులు అన్ని చేపట్టాలని సభ ద్వారా ప్రభుత్వాన్ని ప్రశాంత్ రెడ్డి కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని 4వ వార్డులో నీటి సమస్యను గుర్తించి పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ బోరుబావి ప్రెస్సింగ్ చేయించి నీటి సమస్యను పరిష్కరించినట్టు స్థానికులు తెలిపారు. అలాగే కంచర్ల గ్రామంలో బోరు మోటర్ చెడిపోవడంతో గ్రామ ప్రజల నీటి కష్టాలను పంచాయతీ కార్యదర్శి స్వప్న మంగళవారం పరిష్కరించారు. వేసవికాలంలో నీటి ఇబ్బందులు ఉంటే పంచాయతీ కార్యాలయంలో తెలియజేయాలని కార్యదర్శులు సూచించారు.

నేడు గాంధారిలో తైబజార్ వేలం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి గ్రామ పంచాయతీ పరిధిలోని తైబజార్ వేలంను బుధవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. 1 లక్ష డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని ఈ తైబజార్ ఒక సంవత్సరం కాలానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హనుమాన్ ఆలయ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రమైన తాడ్వాయిలో హనుమాన్ ఆలయ కమిటీని మంగళవారం ఏగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా హరిబ భరత్ రావు, ఉపాధ్యక్షులుగా హరిబా భాస్కరరావు, కార్యదర్శిగా గొల్ల నవీన్, కోశాధికారిగా ముదాం దత్తాత్రేయ, సలహాదారులుగా మేకల రాజు, బండారు సంజీవ్, అంబీర్ శ్యాం రావు, సిద్ధిరాములు, విజయ్, మేకల అనిల్, ఎం మహేష్ గోపాల్, రాజు లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

వీడీసీ చైర్మన్ ఎన్నిక



నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఎర్రపాడు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా ఏనుగు మోహన్ రెడ్డిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. ఉపాధ్యక్షులుగా నర్సాగౌడ్, బాలయ్య, జనరల్ సెక్రెటరీగా, గైని రాజలింగం, సలహాదారులుగా బద్దం సయి రెడ్డి, బొక్క రాజిరెడ్డి, కొంపల రాములు, బి గంగారం లను ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.70 వేలకు పద్మాజివాడి తైబజార్ వేలం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజి వాడి గ్రామంలో మంగళవారం తై బజార్ నిర్వహించారు బజార్ పాటలో పలువురు పాల్గొన్నారు. తై బజార్ ను మహమ్మద్ జలీల్ రూ.70,200 కు దక్కించుకున్నారు. ఎంపీఓ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్ర వాటి లింగారెడ్డి, విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు ఎర్రవాటి గంగారెడ్డి, ఎండి జాకీర్, బీఆర్ఎస్ నాయకులు రాజయ్య ,మామిండ్ల మోహన్ ,చందు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో మంగళవారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు సాయికుమార్ శబరి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దురిశెట్టి అశోక్ ఆధ్వర్యంలో సంఘం ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పట్టభద్రులు డాక్టర్ రాజారాం బాలరాజు మాట్లాడుతూ గతంలో వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం లో ముదిరాజులను బీసీ ఏ లో చేర్చినట్లె చేర్చి సర్టిఫికెట్ కూడా జారీ చేసి తర్వాత ముదిరాజ్ జాతిని చేసి తిరిగి బిసి డిలోనే ఉంచారని ఆరోపించారు. ముదిరాజ్‌ను బీసీ ఏలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, ఆరోగ్యశ్రీ అనిల్, చౌడం రవి, మనోజ్ కుమార్, కిషన్, తలారి సాయిలు, కృష్ణ అంజయ్య ఉన్నారు.

జీపీల తనిఖీ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని నాగ్లూర్, చద్మల్, చద్మల్ తండా, నేరల్, నేరల్ తండా, బీర్మల్ తండా గ్రామ పంచాయతీ లను జిల్లా పంచాయతీ అధికారి మండల ప్రత్యేక అధికారి మురళి తనిఖీ చేశారు. డ్రింకింగ్ వాటర్, నర్సరీ, అంగన్వాడీ కేంద్రం, కంపోస్ట్ షెడ్, శానిటేషన్ పనులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాజేశ్వర్, ఎంపీఓ లక్ష్మి నారాయణ, వివిధ గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ అవుట్ స్టాండింగ్ రీసర్చ్ అవార్డు దక్కడం టీయూకు గర్వకారణం

- వైస్ ఛాన్సలర్ టి యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



అవార్డును అందుకుంటున్న అరుణ

ఇంటర్నేషనల్ ఔట్ స్టాండింగ్ రీసర్చ్ అవార్డు లభించటం విశ్వవిద్యాలయానికే గర్వకారణం అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో వృక్షశాస్త్ర విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణకు బోధన, పరిశోధన విభాగంలో ఇంటర్నేషనల్ అవుట్ స్టాండింగ్ రీసెర్చ్ అవార్డ్ లభించడం తెలంగాణ యూనివర్సిటీకే గర్వకారణమని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ ఎం.అరుణ హైడ్రోబయాలజీ, ఆల్గల్ బయోటెక్నాలజీ విభాగంలో అద్భుతంగా చేసిన ఉన్నతమైన పరిశోధనలను గుర్తించి తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో ఈనెల 23 న జరిగిన ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాంగ్రెస్ 2025 అవార్డు కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఔట్ స్టాండింగ్ రీసర్చ్ అవార్డు లభించటం యూనివర్సిటీకి గర్వకారణమన్నారు.

ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి అరుణకు మెమోంటో బహుకరించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఏ.ఏ. హలీంఖాన్, ప్రొఫెసర్ బి. విద్యావర్ధిని అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జలంధర్ లు అభినందనలు తెలిపారు.

స్కావెంజర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో పని చేస్తున్న స్కావెంజర్లకు వెంటనే గౌరవ వేతనం చెల్లించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో కేవలం సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మూడు నెలలకు ఒకసారి వేతనాలు చెల్లించనున్నట్టు తెలిపారు. వేతనాలు డిసెంబర్ మాసం నుంచి చెల్లించాల్సి ఉందన్నారు. ఒక వైపు మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇంతవరకు నిధులు పాఠశాలలకు విడుదల కాలేదని, పాఠశాలలలో స్కావెంజర్ల సేవలు లేనిదే పాఠశాల నిర్వహణ కష్టంగా ఉంటుందని, ప్రతి పాఠశాలలో అటెండర్ పోస్టులు లేవు. అటెండర్ లేని చోట అన్ని పనులు చేసుకోవాలంటే ప్రధానోపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారిందన్నారు. ఒక పాఠశాల ఆవరణలో తరగతి గదులు శుభ్రం చేయడం, తాగునీరు ఏర్పాటు చేయడం, మరుగుదొడ్ల నిర్వహణ, చెట్ల పెంపకం లాంటి పనులు తప్పనిసరి చేయడం వీటితోపాటు తదితర పనులు కూడా చేయవలసి ఉంటుందని తెలిపారు. ప్రతి పాఠశాల పచ్చదనం పరిశుభ్రతతో ఉండాలనేది సామాజిక సూత్రమని పేర్కొన్నారు.

విద్యార్థుల, ఉపాధ్యాయుల వ్యక్తిగత ఆరోగ్యం, చుట్టూ ఉన్న పరిసరాల మీద ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, పరిసరాల సంరక్షణ మొదలగు అంశాలు చిన్ననాటి నుండే అవగాహన కల్పించాలి. విద్యార్థుల సంఖ్యను బట్టి స్కావెంజర్లను నియమించుకొని, నెల నెలా గౌరవ వేతనాలు చెల్లించినట్టు తెలిపారు. స్కావెంజర్లతో పాఠశాలలకు మేలు జరిగిందన్నారు. మార్చి 31లోపు వేతనాలు చెల్లించాలన్నారు. విద్యా శాఖ తొందరగా నిధులు విడుదల చేస్తే, ప్రధానోపాధ్యాయులు వెంటనే స్కావెంజర్లకు చెల్లించడానికి సమయం ఉంటుందన్నారు. కావునా ప్రభుత్వం వెంటనే స్కావెంజర్లకు గౌరవ వేతనం విడుదల చేయాలని కోరారు.

ఇంగ్లీష్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగర శివారులోని నాగారం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థు నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సైదా జైనబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, పీహెచ్‌డీ లేదా నెట్ లేదా సెట్ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 27 వరకు తమ గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇది పూర్తి తాత్కాలిక పద్ధతిన జరిగే నియామకమని, ఈ నెల 28న డెమో ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా పెన్సిల్వర్ శ్రీకాంత్ గుప్త

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మొగిల్లిపల్లి భూమేష్ గుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా పెన్సిల్వర్ శ్రీకాంత్ గుప్తను నియమించి నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ గుప్త, నరహరి, వలపిశెట్టి లక్ష్మి రాజం, కోశాధికారి రాజేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలాజీ, అడ్మిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గరిపల్లి శ్రీధర్, కార్యదర్శి కోడిశాల శివ, ఆర్యవైశ్య సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- ప్రభుత్వం వెంటనే పిఎం శ్రీ పథకం రద్దు చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని సిడిపిఓ కార్యాలయం వద్ద సిఐటియు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు యాదమ్మ అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం ద్వారా ప్రైమరీ పాఠశాలలలో ప్రీ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, చిన్నారుల ఆధారు నెంబరు సేకరించి అడ్మిషన్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా పిఎం శ్రీ పథకం ద్వారా పూర్తిగా అంగన్వాడీలు నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఈ పథకాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాలేశ్వర్ గ్రామానికి చెందిన బుర్ర రాములుకు బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు 18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మగ్గరి హన్మాన్లు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత చొరవతో బాధితుడికి సీఎం ఆర్ ఎఫ్ చెక్కును అందించడం పట్ల లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

26న గర్గుల్లో ఉచిత దంత వైద్య శిబిరం

నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని గరుగులు గ్రామంలో ఈనెల 26న ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ పాత అరవింద్ తెలిపారు. బుధవారం ఉదయం 9:00 గంటల నుంచి గర్గుల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో గ్రామపంచాయతీ పక్కన గర్గుల్లో డాక్టర్ పాత అరవింద్, డాక్టర్ పాత మేగానాలో ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గర్గులు గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దంతా వైద్య శిబిరంలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

నవతెలంగాణ-కామారెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందజేత

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు అన్నారు. మంగళవారం తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టీఎస్ఎస్ఎఫ్, విఆర్‌కె అకాడమీ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వాటిని సాధించుకోవడానికి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులులో నిరాశ దరిచేరకూడదని కష్టపడితే ఎంతటి విజయమైన దక్కుతుందని తెలిపారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో పోటీ పెరిగిపోయిందని పోటీలో నిలబడాలంటే సరియైన శిక్షణ అవసరమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన డాక్టర్ జైపాల్‌రెడ్డికి టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ తరపున కతజతలు తెలియజేశారు. కార్యక్రమంలో విఆర్‌కె అకాడమి ప్రోగ్రాం ఇన్చార్జి జలిగామ శ్రీకాంత్, సమన్వయ కర్త నవీన్, ఎస్ఆర్‌కె ప్రిన్సిపాల్ దత్తాద్రి, జూనియర్ ప్రిన్సిపాల్ నరేష్, అధ్యాపక బందం శంకర్, మల్లేష్, ధర్మపురి, శేఖర్, రంగనాయకులు, మహేష్, మహేందర్, మధు, నవీన్‌లు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తగా ఒక రోజు



నవతెలంగాణ-కామారెడ్డి

విద్యా మంత్రిత్వ శాఖ గోవా ఢిల్లీ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ సెక్రటేరియట్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శాస్త్రవేత్తగా ఒకరోజు అనే కార్యక్రమాన్ని జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగివున్న సజనత్మకతను, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను హైస్కూల్ స్థాయిలో వెలికితీయుటకు, వారికి పరిశోధనలపై ఆసక్తి పెంపొందించుటకు వినూతన కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. దానిలో భాగమే శాస్త్రవేత్తగా ఒక రోజు అనే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.

దీనిలో భాగంగా చేయవలసిన కార్యక్రమాలు..

దగ్గరలో ఉన్న రీసెర్చ్ ల్యాబ్స్, ప్లానిటేరియం, స్పేస్ సెంటర్, ఐఐటిహెచ్, ఇస్రో చాట్ తదితరు లాంటివి విద్యార్థులను సందర్శింపచేయుట. విద్యార్థులు సైంటిస్ట్, రిసర్చ్ స్కాలర్‌తో పర్సనల్‌గా, విర్చువల్, ఇంట్రాక్ట్ అవుట. క్విజ్, డిబేట్, పోస్టర్ మేకింగ్ సైన్స్ మోడల్ మేకింగ్ కంప్యూటర్స్ నిర్వహించుట. ఎవరైనా ఎన్జీవోల సహకారంతో సైన్స్ ఆక్టివిటీస్‌పై హాండ్స్ ఆన్ ఎక్స్పీరియన్స్ నిర్వహించుట. పై కార్యక్రమాలలో అందుబాటులో ఉన్నవాటిని 6 నుంచి 9తరగతుల విద్యార్థులకు 05/04/25 లోగా నిర్వహించి క్రింది గూగుల్ ఫ్రమ్ లింక్‌లో వివరాలు సబ్మిట్ చేయవలెను. మీరు మీ పాఠశాలలో గాని, ఇతర ప్రదేశాలు సందర్శిస్తే వాటికి సంబంధించిన వివరాలు గూగుల్ ఫామ్‌లో నింపగలరు. https://forms.gle/mnwkX9AKPCPqKBvz9 మరిన్ని వివరాలకు ఎం.సిద్ధిరాం రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ (9440414250)ని సంప్రదించగలరని జిల్లా అధికారి రాజు ఒక ప్రకటన తెలిపారు.